క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో బనశంకరి అమ్మవారు

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు గ్రామంలో వెలసిన అరసనవరు గోత్రానికి చెందిన వక్కలిగుల ఆరాధ్య దేవత బనశంకరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు అమ్మ వారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు కాంతరాజు విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సోమవారం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, హాలుకూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి సేవలో మాజీ ఎమ్మెల్యే


పూజ చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి వారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అర్చకులు మాజీ ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి సన్మానించారు.

సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకోండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి నిర్మలాజ్యోతిపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్బీ జిల్లా కార్యదర్శి పోతులయ్య సోమవారం మంత్రి సవితకు ఫిర్యాదు చేశారు. నిర్మలాజ్యోతి అవినీతికి హద్దే లేకుండా పోయిందన్నారు. వార్డెన్లను బెదిరించి లక్షల రూపాయలు సంపాదిస్తోందని ఆరోపించారు. కోటరీని ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతున్నట్లు వివరించారు.

మంగాపురంలో చోరీ

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మంగాపురం గ్రామంలో ఆదివారం రాత్రి ఉమాపతినాయక్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న రోల్‌గోల్డ్ నగలతో పాటు విలువైన డాక్యుమెంట్‌లను ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య పట్టణంలో ఉన్న ఆస్తిపై వివాదాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఉమాపతినాయక్ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటూ తరచూ వచ్చి వెళ్తుంటారని పేర్కొన్నారు. ఇదే అదనుగా భావించి డాక్యుమెంట్లు ఎత్తుకెళ్లారని, అలాగే బంగారు నగలు అనుకుని రోల్డ్‌గోల్డ్ నగలు అపహరించారని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు.



హిందూపురం: గుడ్డం రంగనాథస్వామి ఆలయం వద్ద భోగి మంటల చుట్టూ కోలాటమాడుతున్న మహిళలు

సంప్రదాయబద్ధంగా 'భోగి'

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో భోగి పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామాల్లో ఇళ్ల ముందు శుభ్రం చేసి మహిళలు ముగ్గులు వేసి రంగవల్లులతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు. పెనుకొండ పట్టణంలో మంత్రి సవిత నివాసం వద్ద భోగి మంటలు వేశారు. అలాగే జూనియర్ కాలేజీలో జరిగిన ముగ్గుల పోటీలను మంత్రి తిలకించారు.


పెనుకొండ జూనియర్ కాలేజీలో ముగ్గును పరిశీలిస్తున్న మంత్రి సవిత

ఈ ఏడాది 'సంక్రాంతి' పండుగ కళ తప్పింది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడంతో మార్కెట్లో సందడి కనిపించడం లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల మీద ఆధారపడిన దిగువ, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా సతమతమవుతుండటంతో హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో పండుగ జోష్ పూర్తిస్థాయిలో కనిపించడం లేదు.


పండుగ వేళ నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఏఆర్ రొప్పం గ్రామం

కళ తప్పిన సంక్రాంతి

- వెల వెలబోతున్న గ్రామాలు
- వస్త్రాలు, రంగులు కొనేవారూ కరువు
- వ్యాపారాలు తగ్గిపోయాయని దుకాణదారుల ఆవేదన

మడకశిరరూరల్: ప్రతి ఏడాది మొదటి పండుగగా జరుపుకునే భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ సందడి గ్రామాల్లో కనిపించడం లేదు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు అంతంతమాత్రంగానే సంబరాలు చేసుకుంటున్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పాటు ఈ పండుగకు ప్రత్యేకంగా ఉపయోగించే గెణసు గడ్డలు, చెరుకు, అనపకాయల ధరలు ఎక్కువగా ధర ఉండడంతో ప్రజలు ఎక్కువగా కొనలేక శాస్త్రం ప్రకారం కొద్దికొద్దిగా కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా అప్పులు చేసి సాగు చేసిన ఖరీఫ్ వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతినడంతో అనపకాయలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇతర ప్రాంతాల్లో పండిన అనపకాయ, చెరుకును వ్యాపారస్తులు తీసుకొచ్చి మడకశిర పట్టణంలోని మార్కెట్లో డిమాండ్‌ను బట్టి విక్రయిస్తున్నారు. సంక్రాంతి పండుగను సందర్భంగా గోమాతకు అనపకాయలు, గెణసుగడ్డలు నోటికి అందించి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చియన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా అంతంత మాత్రంగానే సంక్రాంతి సందడి వాతావరణ కనిపిస్తోంది. వరుస కరువు పరిస్థితుల కారణంగా పంట చేతికందక, చేసిన అప్పులు తీర్చే మార్గంలేక రైతులు అల్లాడుతున్న తరుణంలో సంక్రాంతి పండుగను అంతంతమాత్రంగానే జరుపుకోవాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు చెబుతున్నారు.

సంక్రాంతి సందడి లేదు



ఈ ఏడాది మా గ్రామంలో సంక్రాంతి సందడి అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో ప్రజలతో డబ్బులేక ఇబ్బంది పడుతున్నారు. పండుగకు ఉపయోగించే అనుప, వేరుశనగ, గెణస తదితర వాటిని కోనుగోలుకు కూడా ప్రజలు అప్పులు చేసి తక్కువగా కోనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో సంక్రాంతి మూడు రోజులు పాటు ఎంతో ఆనందంతో జరుపుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– నాగరాజు, ఏఆర్ రొప్పం, మడకశిర మండలం

ఈ ధరలు ఎప్పుడూ చూడలేదు



గతంలో ఎప్పుడు ఇంతలా నిత్యావసర సరుకులు, అనుపకాయలు, వేరుశనగ, గెణస, పండ్లు, పూలు, రంగులు తదితర ధరలు పెరగడం చూడలేదు. ఈ ధరలను చూసి సంక్రాంతి పండుగ జరుపుకోవాలంటే రూ.1000 అప్పు చేసి సరుకులను తక్కువగా కోనుగోలు చేయాల్సి వస్తోంది.

– నరసింహమూర్తి, హరేసముద్రం, మడకశిర మండలం

డబ్బులు లేక ఇబ్బందులు




సంక్రాంతి పండుగ చేసుకోడానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే ఇబ్బంది ఉండేదికాదు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్‌లో పంట సాగు ముగుస్తున్న అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం ఖాతాలోకి జమ చేయలేదు. అప్పులు చేసే తీర్చే మార్గం కనిపించడం లేదు.

– నర్సేగౌడ్, రేకులకుంట, మడకశిర మండలం

తగ్గిన వ్యాపారాలు

అమరాపురం/ గుడిబండ: పండగంటే కొత్త దుస్తులు, పిండి వంటలు, కొత్త వస్తువుల కొనుగోళ్లు, ఇంటికొచ్చిన బంధువులకు కానుకలు, గ్రామస్తులంతా తలో చేయి వేసి నిర్వహించే సంబరాలు... ఇలా కోలాహలం కళ్లకు కట్టేది. ఈ ఏడాది ఏ ఊళ్లో అయినా ఇలాంటి సందడి కనపించడం లేదు. అన్ని వర్గాల ప్రజల్లో ఏదో నైరాశ్యం, నిర్లిప్తత. గత ప్రభుత్వ పాలనలో ప్రతి పేద ఇంటిలో సంతోషం కనిపించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అవసరానికి చేతిలో చిల్లిగవ్వలేదు. పెద్ద పండుగ వచ్చినా సందడి కనిపించడంలేదు. చిల్లర దుకాణాల్లో కనీసం రంగులు కొనేవారు లేకపోవడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు.


అమరాపురం: చెరకు గడలు, వేరుశనగ విత్తనాలు తదితర వాటిని కొనుగోలు చేసే వారులేక వెలవెలబోతున్న దుకాణం


గుడిబండ: వ్యాపారం లేక దిగాలుగా కూర్చున్న రంగుల వ్యాపారి

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



హిందూపురం: నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సంక్రాంతి నవ క్రాంతులు నింపాలని ఆకాంక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఓటు బ్యాంకుగానే ముస్లిం, మైనార్టీలు


సమావేశమైన ఆవాజ్ కమిటీ నాయకులు

పెనుకొండ: ముస్లిం మైనార్టీలను పాలకులు ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని సీఐటీయూ నాయకుడు బాబావలి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా ముస్లిం, మైనార్టీలు అభివృద్ధి చెందలేదన్నారు. ఎన్నికల సమయంలో ముస్లిం, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న పాలకులు అనంతరం వారి గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం మండల ఆవాజ్ కమిటీని ఎంపిక చేవారు. కన్వీనర్‌గా మహబూబ్‌బాషా, సభ్యులుగా బాబా, ఆర్పి, హబీబ్, సిరాజ్, సిక్బత్, సర్ఫరాజ్ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ నాయకులు మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హిందూపురం: మాజీ కౌన్సిలర్ జేఈ వెంకటస్వామి భౌతికకాయం వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ శివ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు చాంద్ బాషా, వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్‌గౌడ్ , జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'విలువలు మరచిపోకూడదు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

పావగడ: సమాజానికి ఉపయోగపడే ఉత్తమ విలువలతో కూడిన 'విలువలు మరచి పోకూడదు' పుస్తకం ఎంతో విలువైనదని బెంగళూరు విశ్వ విద్యాలయం అధ్యాపకుడు డా చిత్తయ్య పూజార్ అన్నారు. తాలూకాలోని కిలార్లహళ్లి గ్రామంలో రాష్ట్రస్థాయి సంపన్మూల వ్యక్తి నవీన్ కిలార్లహళ్లి రచించిన ×విలువలు మరచిపోకూడదు÷ పుస్తకాన్ని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆటు పోట్లు ఎదుర్కొన్న వారు చరిత్రను సృష్టిస్తారన్నారు. అలాంటి కోవకు చెందిన రచయిత నవీన్ కిలార్లహళ్లి అని కొనియాడారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో యువత దురలవాట్లతో పెడదారిన పడుతున్న నేపథ్యంలో యువ సమాజానికి తన పుస్తకం ద్వారా చక్కటి సందేశాన్ని అందించారన్నారు. ఈ పుస్తకాన్ని అందరూ కచ్చితంగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు సణ్ణ నాగప్ప, రైతు కవి డా శంకరప్ప, కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అంతకు ముందు పుస్తకాన్ని ఉంచి అలంకరించిన బుట్టను మహిళలు గ్రామంలో ఊరేగించారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు


గోరంట్లలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న దృశ్యం

గోరంట్ల: పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నేత్రావతి, గీతమ్మ, విజయమ్మ, కిష్టప్ప, చంద్రశేఖర్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

కుప్పలు తెప్పలుగా వ్యర్థాలు

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమ నుంచి వెలువడిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఇష్టానుసారం పారేస్తున్నారు. మండలంలోని దుద్దేబండ పంచాయితీలోని గొందిపల్లి రెవెన్యూ పొలంలో కియా పరిశ్రమలోని వ్యర్థాలు వేసుకునేలా నిర్వాహకులు డంపింగ్ ఏర్పాటు చేసుకున్నారు. అనవసరమైన వాటిని కాల్చి వేయాలని పరిశ్రమ సూచించేది. అయితే నిర్వాహకులు అనవసరమైన చెత్తను ఎక్కడ పడితే అక్కడ వదిలేయడంతో అది కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. జన సంచారం లేకపోయినా పశు పక్షాదుల మనుగడకు ఇబ్బందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


గొందిపల్లిలో కుప్పగా ప్లాస్టిక్ వ్యర్థాలను వేసిన దృశ్యం

పార్టీని మరింత బలోపేతం చేయండి

- భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


మడకశిర పట్టణ నాయకులతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పట్టణ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. పట్టణంలోని పలు సమస్యలను నాయకులు సమన్వయకర్త ఈరలక్కప్ప దృష్టికి తీసుకెళ్లారు. పార్టీకి రాజీనామా చేసి వేరే పార్టీలో చేరిన కౌన్సిలర్లను సస్పెండ్ చేయాలని పట్టణ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇంకా అనేక సమస్యలను ఈరలక్కప్ప దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తల ఐక్యతే పార్టీకి బలమన్నారు. వార్డుల వారీగా పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదేనని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తనయుడు జయరాజ్, కౌన్సిలర్లు నాగేంద్ర, విక్రమ్, అన్సర్, కోఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, ఫకృద్దీన్, మధు తదితరులు పాల్గొన్నారు.


నాటి గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సందడిగా అపూర్వ సమ్మేళనం

పరిగి: మండలంలోని ఊటుకూరులో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల మొత్తం కలియ తిరిగి నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒకరి కష్టసుఖాలను ఒకరు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ మనోజ్ ఆరాధ్య , విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, ఫణికుమార్, ఉపాధ్యాయులు ఏలియా, బాలకృష్ణ, షానవర్‌బాషా, అశోక్‌కుమార్, నూర్ మహమ్మద్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

మడకశిర: భోగి పండుగను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని చంద్రమౌళేశ్వర, భోగిరామేశ్వర, మల్లేశ్వర, దత్త బాణలింగేశ్వర, అయ్యప్పస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

కియా కార్మికుడికి గాయాలు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన సంఘటన మండల పరిధిలోని గ్లోవిస్ పరిశ్రమ ఎదురుగా సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... చెర్లోపల్లికి చెందిన ఆనంద్ కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజులాగే తన ద్విచక్ర వాహనంలో విధులకు బయలుదేరాడు. మార్గమధ్యలో గ్లోవిస్ పరిశ్రమ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను అనంతపురం తరలించారు.

● ఉల్లాసంగా.. ఉత్సాహంగా

మడకశిరరూరల్/లేపాక్షి: పాఠశాలలు, కాలేజీలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. కొందరు వారి ప్రాంతాల్లో ఉన్న మైదానాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ తదితర క్రీడలు ఆడుతుండగా.. చిన్నారులు వారి ఇళ్ల వద్ద వివిధ ఆటలు ఆడుతూ పండుగ సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు.


ఫుట్‌బాల్ ఆడుతున్న యువకులు


మడకశిరలో వాలీబాల్ ఆడుతున్న యువకులు


లేపాక్షిలోని రాజీవ్‌కాలనీలో తొక్కుడు బిళ్ల ఆడుతున్న పిల్లలు